# పరాయి సిరా

అనువాద కథలు

## స్వేచ్ఛానువాదం–మల్లాది వెంకట కృష్ణమూర్తి



### చిన్నమాట

కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.

కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.

తెలుగులో ఆ950–ఆ960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.

విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్థమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.

చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.

అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...

మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.

# కథ పేరు: హేరియంట్‌కి ఏమైంది?
# { మేరీబ్రాండ్ కథకి స్వేచ్ఛానువాదం}
## కథాకాలం: మే 1974

**విల్సన్ కేరక్టర్ ఏక్టర్.** అతను ఒకప్పుడు సినిమాల్లో, ఇప్పుడు టి.విల్లో నటిస్తున్నాడు. ఓ టి.వి సిరీస్‌లో అతను గయ్యాళి భార్యకి భర్తగా చక్కగా నటించాడు. అతనారకం పాత్రలని చక్కగా పోషించడానికి కారణం నిజజీవితంలో కూడా అతని పాత్ర అదేకావడం. ఆదాయం పెద్దగా లేకపోయినా తన భార్యని పోషించే స్థోమతగల ఆదాయం మాత్రం వస్తుంది.

అతని భార్య హేరియెట్ కూడా నటే. ఆమె ఆఖరుసారి ఎప్పుడు కెమేరా ముందుకి వెళ్ళిందో ఆమెకి తప్ప ఇంకెవరికీ తెలీదు. అది వాషింగ్ పౌడర్ని పొగిడే ప్రకటనకోసం. ఎనభై కిలోల బరువుతో లావుగా ఉండే ఆమె చాక్లెట్స్‌ని, ఫ్రెంచ్ ఫ్రైస్‌ని అధికంగా తినడంతో ఎనిమిదిమంది పిల్లల తల్లిలా కనిపిస్తుంది. ఆ ప్రకటనలో ఆమె కుటుంబమంతా మురికి మనుషులు. హేరియెట్ రిహార్సల్స్ లేకుండా నటించగలిగింది. ఆ పిల్లల బట్టలన్నీ వాషింగ్ మెషీన్‌లో వేసి ఆ వాషింగ్ పౌడర్‌తో ఉతుకుతుంది.

ఆమెకి భర్తంటే కోపం, చులకన భావాలకి కారణం వారికి పిల్లలు లేకపోవడమే, విల్సన్‌లాంటి చిన్న నటుడ్ని తను పెళ్ళిచేసుకోకపోతే గొప్ప నటిని అయ్యేదాన్నని సదా దెప్పుతూంటుంది.

వాళ్ళ పెళ్ళైనప్పుడు కఠిన హృదయంగల హేరియెట్ సన్నగా నాజూగ్గా ఉండేది. విల్సన్ కూడా సన్నగా ఉండేవాడు. ఆ రోజుల్లో సన్నగా ఉండే నటులు హాలీవుడ్‌లో చాలామంది ఉండేవాళ్ళు. హేరియెట్‌తో పెళ్ళయ్యాక అతని మొహంలోని అమాయకత్వం మాయమై, ఓ విధమైన కఠినత్వం రావడంతో అతనికి డిమాండ్ వచ్చింది. విల్సన్ ఆ స్థితికి చేరుకునేదాకా హై క్లాస్ రెస్టరెంట్లలో గిన్నెలు తోముతూ, హేంబర్గర్ షాపుల్లో సేల్స్‌మేన్‌గా పనిచేస్తూ సంపాదించేవాడు.

బి (చిన్న బడ్జెట్ సినిమాలు) సినిమాల్లో అతను రిసెప్షనిస్ట్, బేంక్ క్లర్క్‌లాంటి చిన్న పాత్రల్లో నటించేవాడు. క్రమంగా హేరియెట్ నటిగా విరమించుకుంది. అతను బిజీ అయ్యాడు. హై నూన్, బ్లాక్ రాక్ అనే కౌబాయ్ సినిమాల్లోని పాత్రలద్వారా విల్సన్ కి బ్రేక్ వచ్చింది. రెండో సినిమాకి అకాడమీ అవార్డ్ రావడంతో ఆ సినిమాలోని అందరికీ బ్రేక్ వచ్చింది. అతనికి వరసగా అదే తరహా పాత్రలు వచ్చాయి.

ఓ రోజు టివి ఛానల్లో క్విజ్ మాస్టర్‌గా అతనికి ఆఫర్ వచ్చింది. అతను దానిమీద ఉత్సాహం చూపించలేదు. స్టార్స్ అండ్ దెయిర్ ఫెయిల్యూర్స్ అనే ఆ ప్రోగ్రాంకి ఆడిషన్‌కి వెళ్ళమని అతని ఏజంట్ పట్టుపట్టాడు. అది విజయవంతమైంది. హేరియెట్ భర్తగా అతను నిజ జీవితంలో హాస్యంతో అధిగమిస్తూ వస్తున్నాడు. దాన్ని అతను తెరమీద ప్రదర్శించసాగాడు.

అందుకు అతను స్క్రిప్ట్‌ని సెట్స్‌మీదే మార్చేవాడు. అది ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. హేరియట్‌కి తప్ప మిగిలిన అందరికీ ఆ తరహా పాత్రలు నచ్చాయి.

'ఇదేం పాత్ర? ఇదేం నటన?' అని హేరియెట్ మిత్రుల ముందు తన భర్తని విమర్శించేది.

"మనకి డబ్బవసరం. చాలా పెద్ద మొత్తం అవసరం. అందుకోసం నటిస్తున్నాను" విల్సన్ ఓ రోజు చెప్పాడు.

"కాని నువ్వు నటించడంలేదు. కెమేరా ముందు నా దగ్గరలా ప్రవర్తిస్తున్నావు" అభ్యంతరం చెప్పింది.

"అందులో తప్పేంలేదు. నేను నాలా ఉంటూ డబ్బు సంపాదించడం మంచిదేగా?" అతను జవాబు చెప్పాడు.

అతని టి.వి సీరియల్లోని జోక్స్‌కి మిగతా ప్రేక్షకుల్లా ఆమె నవ్వేదికాదు. 'ఈ సీరియల్ అట్టే కాలం కొనసాగదు' అనేది.

కొన్ని నెలల తర్వాత ఆ టి.విషోని ఆపేసారు. కాని ప్రేక్షకులనించి అది కావాలని ఉత్తరాలు, ఫోన్ కాల్స్ రావడంతో మళ్ళీ కొనసాగించారు. విల్సన్‌కి అభిమానులనించి ఉత్తరాలు ఆరంభమయ్యాయి.

హేరియెట్ హెల్త్ స్పాకి వెళ్ళి ఏడు కిలోలు తగ్గి, వేషాలకోసం తన ఏజంట్ దగ్గరకి వెళ్ళింది.

"సారీ హేరియెట్! ఇప్పుడు ముఖ్యం అనుభవం కాదు. సెక్స్ అపీల్ అవసరం. మీదా వయసు కాదు" ఏజెంట్ నిరుత్సాహపరిచాడు.

"నేను వచ్చిన కొత్తల్లో సెక్స్ అపీల్ కాదు, అనుభవం కావాలి అనేవాడివి శామ్."

"నాకది గుర్తుంది. కాని కాలం మారింది."

త్వరలోనే విల్సన్ సెలబ్రిటీ అయ్యాడు. విమెన్స్ క్లబ్స్ అతన్ని మాట్లాడటానికి ఆహ్వానించసాగాయి. అనేక సినిమాల్లో, టి.వి డ్రామాల్లో అతనికి వేషాలు వచ్చాయి. అతను స్టార్ కాదు కాని ఇంట్లో ప్రతీ వాళ్ళు ఆదరించే నటుడు అయ్యాడు. అపార్ట్‌మెంట్‌నించి స్విమ్మింగ్ పూల్ గల కొండమీది రేంచ్ హౌస్‌కి మారారు. ఏడాదికోసారి విశ్రాంతికి హొనలులూకి, షాపింగ్‌కి న్యూయార్క్‌కి వెళ్ళసాగారు. తన భర్తకి కీర్తి అధికమయ్యేకొద్దీ హేరియెట్ అతన్ని ద్వేషించసాగింది.

"నాకు ఇది అర్థంకాదు. నీలో నటనా నైపుణ్యం లేదు. నటనా చాతుర్యంగల నేను ఎందుకు ఇంట్లో కూర్చుంటున్నాను? ఆ రెండూ లేని నువ్వు రోజూ షూటింగ్‌కి వెళ్తున్నావు. పోనీ అందగాడివా? కాదు. ఐనా అంతా ఎందుకు నిన్ను ఆరాధిస్తున్నారు?" కోపంగా అడిగేది.

"నేను ఫర్వాలేదు అనుకునే కొందరు ఉన్నరు. ఐనా మనకి పెళ్ళై ఇన్నేళ్ళైనా నాగురించి నీకింకా పూర్తిగా తెలీదు హేరియెట్" చెప్పి అతను నవ్వేవాడు.

ఆమెకో రోజు ఓ సంగతి తెలిసింది. స్టూడియోలోని బంగారు రంగు జుట్టుగల ఓ అసిస్టెంట్‌తో విల్సన్ అనేకసార్లు రెస్టారెంట్లలో, డ్రైవ్ ఇన్ థియేటర్లలో కనపడ్డాడని చాలామంది చెప్పారు. ఆమెని చూసి, 'దీన్లో ఏం చూసాడు?' అనుకుంది.

రాత్రిళ్ళు ఇంటికి ఆలస్యంగా రావడం, షూటింగ్ లేకపోయినా ఇతర ఊళ్ళకి వెళ్ళడం మొదలయ్యాక ఇక హేరియెట్ ఊరుకోలేకపోయింది. ఓ వేసవి వేడి రాత్రి ఆమె అతన్ని నిలదీసింది.

"హేరియెట్! కొన్ని సంవత్సరాలుగా నువ్వు, నేను ఒకర్నొకరు ప్రేమించుకునే జంటగా జీవించడంలేదు. అలాంటప్పుడు ఎందుకు గొడవ పడుతున్నావు?" అతను అడిగాడు.

"నువ్వు వెధవ్వి. మంచి నటుడివి కావు. ప్రేమికుడివీ కాదు. తండ్రివి అసలు కాలేకపోయావు. ఇప్పుడు మంచి భర్తవి కూడా కాకుండా పోతున్నావు" అరిచింది.

"నీకు నష్టపరిహారంగా ఈ ఇల్లు ఇస్తాను" అతను శాంతంగా చెప్పాడు.

"అప్పుడు నువ్వా బంగారు రంగు జుట్టున్న బుద్ధిలేనిదాన్ని చేసుకుని, నన్ను నట్టేట ముంచదలిచావా? నేను నీకోసం నా కెరీర్ని త్యాగం చేసి నువ్విప్పుడు ఏ స్థానానికి చేరుకున్నావో దాన్ని నిర్మించడానికి శ్రద్ధ చూపించి ఉండకపోతే, నేను నటిగా ఏ స్థాయికి ఎదిగేదాన్నో ఎవరికి తెలుసు?"

హేరియెట్కి కోపం వచ్చినప్పుడు విల్సన్కి నవ్వొస్తుంది. బదులుగా కోపం తెచ్చుకోకుండా ఉండటానికి అతను హాస్యం చాటున దాక్కుంటూంటాడు. అతను ఆ మాటలకి పగలబడి నవ్వసాగాడు. ఆమెలోని కోపం వెంటనే కట్టలు తెంచుకుంది. బార్ స్టూల్మీద కూర్చుని విస్కీ తాగే అతన్ని బలంగా నెట్టింది. అతను చేతిలోని విస్కీ గ్లాస్తో వెనకున్న ఈత కొలనులోకి పడ్డాడు. ఆ ఈతకొలను ఇంటితోపాటు వచ్చింది. కాని విల్సన్కి ఈత రాదు. హేరియెట్కి బాగా వచ్చు. కాని ఆమె అది ఎక్సర్సైజ్గా భావించి కొలనులోకి దిగేదికాదు. ఆమె నడుం మీద చేతులు ఉంచుకుని ఎర్రబడ్డ మొహంతో, నీళ్ళల్లోకివెళ్ళి, పైకి తేలి, మళ్ళీ  తన భర్త మూడు, నాలుగుసార్లు నీళ్ళల్లోకి వెళ్ళడం ఉగ్రంగా చూసింది. అతను ఐదోసారి పైకి రాలేదు. కొద్దిసేపటికి విల్సన్ నీళ్ళమీద తేలసాగాడు.

అతని చేతిలోని గ్లాస్ని చూసిన పోలీసులు అతను తాగిన మత్తులో ప్రమాదవశాత్తు ఈతకొలనులో పడ్డాడని భావించారు. అతను వెండి తెరమీంచి, చిన్న తెరమీంచి శాశ్వతంగా నిష్క్రమించాడు. ఆ బంగారు జుట్టు అమ్మాయికి డబ్బు అందడం ఆగిపోయింది.

విల్సన్ ఎన్నడూ విల్లు రాయలేదు. కాబట్టి కేలిఫోర్నియా చట్టప్రకారం హేరియెట్ మొత్తం ఆస్థికి వారసురాలైంది. అది చాలా ప్రొఫెషనల్స్ ఇచ్చిన సలహాలతో పెట్టుబడి పెట్టిన షేర్లు, బేంక్లో పెద్ద మొత్తం. ఆమెకి ఆనందంగా ఉంది. తన భర్త లవ్ ఎఫైర్స్ని అడ్డుకోనవసరంలేదు. తన కెరీర్లో ఇప్పుడు అతను అడ్డంకి కాదు. తను ఎదగచ్చు. ఆమె విల్సన్కి చెందిన అన్ని వసువులని ఇంట్లోంచి తీసేసింది. ప్రతీ గదిని వెదికి అతని దుస్తులని, ఇతర వస్తువులని సెకండ్ హేండ్ దుకాణాల్లో అమ్మేసింది. ఇక తను పామ్ స్ప్రింగ్స్కి లేదా లాస్ వెగాస్కి ఎప్పుడు కావాలంటే అప్పుడు వెళ్ళిరావచ్చు అనుకుంది.

ఆ ఇల్లు చాలా పెద్దది. వంటరిగా, నిశ్శబ్దంగా ఉండటంవల్ల కంపెనీకోసం హేరియెట్ టి.విని చూసేది. అకస్మాత్తుగా ఓ రోజు తెరమీద విల్సన్ కనిపించాడు. 'స్టార్స్ అండ్ ఫెయిల్యూర్స్ ' ప్రోగ్రాంని అతను పోయిన సందర్భంగా పునఃప్రసారం చేస్తున్నారు. అతని జోక్స్‌కి స్టూడియో ఆడియెన్స్ నవ్వులు వినిపించసాగాయి. ఆమె నిశ్శబ్దంగా ఆ షోని మొదటిసారి మొత్తం చూస్తూ కూర్చుంది. అతనేం చెప్తున్నాడో వినకుండా అతని మొహంలోని భావాలనే చూస్తూ కూర్చుంది.

కొన్ని రోజులకి తన ఒంటరితనానికి ఆమె భయపడసాగింది. ఎవరైనా ఫోన్ చేసి వస్తే బావుండును అనుకునేది. కాని ఆమెది స్నేహమనస్థత్వం కాదు. తను చాలా సంవత్సరాలుగా కలవని కేన్సస్‌లో నివశించే తన చెల్లెలు మార్గరెట్‌కి ఫోన్ చేసి ఆహ్వానించింది.

"నాకూ రావాలనే ఉంది. కాని టిక్కెట్ నాకు అందుబాటులో లేదు" మార్గరెట్ నిరాకరించింది.

"నీ టిక్కెట్ నేను కొంటాను."

"ఏదేమైనా పిల్లల్ని వదిలి రాలేను" మార్గరెట్ సున్నితంగా తిరస్కరించింది.

మార్గరెట్ విడాకులు తీసుకుంది. ఆమె పిల్లలు ఇప్పుడు టీనేజర్స్.

"నీ పిల్లల టిక్కెట్లు కూడా కొంటాను" హేరియెట్ చెప్పింది.

వాళ్ళు వచ్చాక ఆమె ఇల్లు నవ్వులతో, ఈతకొలనులోని నీటి చప్పుడుతో, అందమైన కార్పెట్ మీద తడిపాదాలతో, కొండలకొద్దీ హాట్ డాగ్స్, పొటాటో చిప్స్, పాప్‌కార్న్‌లతో నిండిపోయింది. పిల్లలు లేకపోవడంలోని ప్రయోజనాన్ని హేరియెట్ మొదటిసారి గమనించింది.

పిల్లలతో మార్గరెట్ హాలీవుడ్ టూర్ బస్‌లో వెళ్ళింది. డిస్నీలేండ్‌కి వెళ్ళింది. తన బావగారి గౌరవార్ధం ప్రసారం చేసిన స్టార్స్ అండ్ ఫెయిల్యూర్ ప్రోగ్రాంని ఆమె టి.విలో నిత్యం చూడసాగింది. హేరియట్ కూడా సోఫాలో కూర్చుని మనసులో విసుక్కుంటూ పిల్లలతో దాన్ని చూడసాగింది. పిల్లలు అతని జోక్స్‌కి పడీపడీ నవ్వసాగారు.

డౌన్‌టౌన్‌లోని ఓ సినిమా థియేటర్లో విల్సన్ పాత సినిమాలని చూపిస్తున్నారని మార్గరెట్ అక్కతో చెప్పింది. అంతా దానికి వెళ్ళారు. దాంట్లో విల్సన్ ఓ హోటల్ మేనేజర్ పాత్ర నటించాడు.

"సిగరెట్ పొగ కళ్ళల్లోకి పోతూంటే, కనుబొమలు ఎగరేస్తూంటే విల్సన్ మనమధ్యే ఉన్న భావన నాకు కలిగింది. ఇది భర్త పోయిన ఎవరికీ కలగని ఓదార్పు నీకు. ఇలా ఎవరికీ పోయిన భర్త మళ్ళీ కనపడదు" మార్గరెట్ బయటకి వచ్చాక చెప్పింది.

సన్నగా ఉన్న విల్సన్ తెరమీద నడుస్తూ, కదులుతూ, మాట్లాడటం హేరియెట్‌కి కొంత ఓదార్పుగా అనిపించింది. అతని మొహం మళ్ళీ చూస్తుందని ఆమె అనుకోలేదు.

వేసవి శెలవలు ముగియడంతో పిల్లలు స్కూల్లో చేరడానికి తల్లి వారితో వెనక్కి మళ్ళీ కేన్సాస్‌కి వెళ్ళిపోయింది. వాళ్ళని ఏర్‌పోర్ట్‌లో దింపడానికి వెళ్ళినప్పుడు హేరియెట్‌కి ఎంతో రిలీఫ్‌గా అనిపించింది. వాళ్ళకి వంట చేయాల్సిన అవసరంలేదు. ఇక మార్గరేటైతే ఆపకుండా మాట్లాడుతూంటుంది. పిల్లలు ప్రతీ చిన్నదానికీ పెద్దగా నవ్వుతారు. ఆ నిశ్శబ్ద ఇల్లు ఆమెకి హాయిగా అనిపించింది.

కాని వాళ్ళు వెళ్ళాక ఆకలి తగ్గినట్లై, వంట మానేసింది. బిస్కెట్స్, చిప్స్ తిని ఓడ్కా తాగసాగింది. ఆమె టి.వి ముందు కూర్చుని స్టార్స్ అండ్ ఫెయిల్యూర్‌ని చూడసాగింది. దానికోసం ఎదురుచూడసాగింది. అద్దైపొయ్యాక ఏం చేయాలో తోచేదికాదు. మనసు చిరాగ్గా ఉండేది. ఆమె క్రమంగా బరువు తగ్గసాగింది.

ఓ డ్రైవిన్ థియేటర్లో 'హై నూన్' సినిమా ఆడుతోందని ఆమెకి తెలిసింది. తన కార్లో వెళ్ళి ఓ టిక్కెట్ తీసుకుంది. విల్సన్ తెరమీద ఐదు నిమిషాలు మాత్రమే కనిపించాడు. ఆమె ఆ సినిమాని తీసే దాకా రోజూ విల్సన్‌ని చూడటానికి వెళ్ళేది.

ఓ రోజు స్టార్ అండ్ ఫెయిల్యూర్స్‌లో విల్సన్ కుర్చీలో ఓ కొత్త నటుడు కనిపించడంతో టి.వి స్టూడియోకి ఫోన్ చేసి విల్సన్ ఏమయ్యాడని అడిగింది.

"అతను మరణించాక ఆ షో ఆగిపోయింది. ఇప్పుడు కొత్త నటుడితో దాన్ని పునఃప్రారంభించాం" సమాధానం వచ్చింది.

మొదటిసారి హేరియెట్ తన భర్త విల్సన్ మరణానికి కన్నీరు కార్చింది. ఇక ఇంట్లో ఉండలేక మర్నాడు కారులో లాస్‌వెగాస్‌కి వెళ్ళింది. ఆమె జూదం ఆడటానికి వెళ్ళిన కేసినో పక్కన పాత సినిమాలు చూపించే థియేటర్ ముందునించి వెళ్తూ, అందులో విల్సన్ నటించిన సినిమాని ప్రదర్శిస్తున్నారని చూసి, వెంటనే కారుని దాని పార్కింగ్ లాట్‌లోకి పోనిచ్చింది. ఆమె తన డబ్బుని జూదంలో వృధా చేసే బదులు ఆ థియేటర్‌కి వెళ్ళి, చాలా తక్కువగా అక్కడక్కడా కనిపించే తన భర్తని చూడసాగింది. సినిమా అయాక తన హోటల్ గదికి ఓడ్కా సీసాతో వెళ్ళింది. ఆ వారాంతంలో సినిమా మారింది. అది పాంస్ప్రింగ్స్‌లో ప్రదర్శిస్తారని తెలిసి, కార్లో అక్కడికి వెళ్ళింది. అక్కడి స్థానిక టి.విలో స్టార్ అండ్ ఫెయిల్యూర్ చూపిస్తున్నారని తన హోటల్ గదిలోని టి.వి గైడ్ ద్వారా తెలుసుకుని ఆ షో చూడటానికి ఆ మోటెల్లో వరసగా ఆరువారాలు బస చేసింది. తిండి తగ్గడంతో ఆమె బరువు కూడా క్రమంగా కోల్పోసాగింది. విల్సన్ కుర్చీలో కొత్త నటుడు కనపడగానే మోటెల్‌ని ఖాళీచేసి తిరిగి లాస్‌ఏంజెలెస్‌కి వెళ్ళిపోయింది. వారం తర్వాత ఆమె ఏజెంట్ శామ్ నించి ఫోన్ వచ్చింది.

"హేరియెట్ నీకు సరిపడే పాత్ర ఒకటి వచ్చింది. ఆసక్తి ఉందా? ఆ పాత్ర లక్షణాలన్నీ చదివాక నువ్వే గుర్తు వచ్చావు" అడిగాడు.

ఆమెలో కొత్త ఉత్సాహం ప్రవేశించింది. అది కొత్త టి.వి సీరియల్ అని తప్ప శామ్ ఇంకే వివరాలు చెప్పలేదు. చాలాకాలం తర్వాత కెమేరా లైట్ల ముందుకి వెళ్తున్నందుకు ఆమెకి సంతోషం కలిగింది. లేచి ఏం వేసుకోవాలా అని వార్డ్ రోబ్ మొత్తం వెదికింది.

హేరియెట్‌ని చూడగానే శామ్ నోరు తెరుచుకుంది.

"హేరియెట్! ఏమైంది నీకు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఏమిటి ఏమైంది?"

"ఇంత సన్నబడ్డావేమిటి? వాళ్ళకి లావుగా ఉన్న గయ్యాళి తల్లిపాత్రకోసం నటికావాలి. క్రితంసారి నేను చూసినప్పుడు నువ్వు దాని పర్‌ఫెక్ట్. సారీ. ఇప్పుడు కాదు."

ఆమె అతని గదిలోని నిలువుటద్దంలో చూసుకుంది. లోతుకు పోయిన కళ్ళు, బుగ్గలు.

"శామ్! నీకు పోలిక తెలుస్తోందా?" నవ్వుతూ అడిగింది.

"ఏం పోలిక?"

"నేను విల్సన్‌లా సన్నబడ్డాను."

"అచ్చం విల్సన్ మాట్లాడినట్లే ఇప్పుడు మాట్లాడావు. ఇదివరకు ఇలా మాట్లాడేదానివి కావు" శామ్ ఆశ్చర్యంగా చెప్పాడు.

ఆమె తన ఇంటికి తిరిగి వెళ్ళింది. తిట్టడానికి, విసిగించడానికి విల్సన్‌లేని ఆ జీవితం ఆమెకి చాలా విసుగ్గా ఉంది. ఆమె ఫోన్ మళ్ళీ మోగలేదు.

హేరియెట్ ఓ రోజు డిటెక్టివ్ ఏజన్సీని కలిసి, తన కోరిక చెపితే వాళ్ళు ఆశ్చర్యపోయారు. వాళ్ళు అమెరికాలో వెలువడే అన్ని దినపత్రికలని వెదికి, అమెరికాలో ఏ సినిమా థియేటర్లోనైనా లేదా ఏ స్థానిక టి.వి స్టేషన్లోనైనా విల్సన్ నటించిన చిత్రాలు లేదా కార్యక్రమాలు ప్రదర్శిస్తుంటే తెలియచేయాలి.

ఆమె అమెరికా అంతటా ఇక్కడో వారం, అక్కడో వారం గడుపుతూ విల్సన్ పదేళ్ళ క్రితం నటించిన సినిమాలని, టి.వి షోలని చూడసాగింది. ఆమె చేతిలో సదా ఓడ్కా సీసా ఉంటుంది. ఆమె ఇంట్లోని స్విమ్మింగ్ పూల్ నీళ్ళల్లో నాచు పేరుకుంది.

ముగింపు విస్కాన్సిన్‌లోని గ్రీంబేలో జరిగింది. బయట పదిహేను డిగ్రీల ఫారన్‌హీట్ వాతావరణం. వచ్చిన తక్కువమంది ప్రేక్షకులు సినిమా ముగిసి బయటకి వెళ్ళాక ఊడ్చేవాళ్ళు ఊడుస్తూ చూస్తే, తన సీట్లో తల వెనక్కి వాల్చిన ఆమె కనిపించింది. ఖాళీ ఓడ్కా సీసా నేలమీద పడి ఉంది. వాళ్ళు లేపడానికి తడితే ఆమె ఒళ్ళు చల్లగా ఉంది. తెరచుకున్న కళ్ళు వెండి తెరవంకే చూస్తున్నాయి.

"ఎవరామె?" ఒకరు అడిగారు.

మేనేజర్ ఆమె హేండ్ బేగ్ తెరచి చూసి చెప్పాడు.

"దేవుడికే తెలియాలి. తర్వాతి షో ఆరంభించేలోగా ఈవిడని ఇక్కడనించి తరలించాలి. ఈమధ్య పాత విల్సన్ సినిమాలు ఓ కల్ట్‌గా మారుతోంది. ఈ ముసలి తాగుబోతు అతని అభిమాని అన్న సంగతి బయటకి పొక్కకూడదు. అతని భార్యకి అది తెలిస్తే ఎంతో బాధపడుతుంది."

**(వచ్చేనెల మరో కథ)**

Post your comments